
# నాన్న రాసిన ఉత్తరం

- చోడిశెట్టి శ్రీనివాసరావు



నేను ఆఫీసు నుంచి వచ్చేసరికి మా సుపుత్రుడు సుందరం ఇంట్లో వున్నాడు. వాడు పదవ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల సందర్భంగా మా నాన్నగారు వుంటున్న ఊరెళ్ళి నాల్రోజులుండొస్తానని పట్టుబట్టాడు... వరి పొలాలు, కొబ్బరి, మామిడి వగైరా తోటల పచ్చదనం ఇంకా మిగిలి వున్న పల్లెటూరది. అప్పుడప్పుడూ అమ్మా నాన్నలు రావడమే గాని మాకు వెళ్ళడమే కుదరడం లేదు. వీడైనా అక్కడ నాల్రోజులూ హాయిగా గడిపి వస్తాడని పంపిస్తే – గోడకు కొట్టిన బంతిలా వెళ్ళిన రోజునే వెనక్కి వచ్చెయ్యడం చాలా ఆశ్చర్యమనిపించింది నాకు.

"ఏరా...! అప్పుడే వచ్చేశావ్? నీకేం తోచలేదా? తాతయ్య, నాన్నమ్మలేమైనా అన్నారా...?"-లాంటి ప్రశ్నలకు వాడినుంచి జవాబు రాలేదు.

ఇంతలో శ్రీమతి "ఈ ఉత్తరం మావయ్యగారు మీకివ్వమన్నారట!" అంటూ టీతోపాటు ఓ కవరు తెచ్చి నాకిచ్చింది... టీ తాగి, కవరు చించి దాన్లో వున్న కాగితం తీసి మడతలు విప్పాను....

"అబ్బాయ్ !

రాకరాక వచ్చిన సుందరం రాక మాకు చాలా సంతోషమైంది. వెంటనే మీ అమ్మ వాడికిష్టమైన ఫలహారం చేసి పెట్టింది. వాడి చదువు సంధ్యల గురించి నేను అడుగుతున్న సమయంలో – మన తోటలో కొబ్బరికాయలు తీసేటందుకు మనిషి వచ్చాడు... అతను తీసిన కొబ్బరి కాయలు ఆరువందలు. "కొబ్బరికాయ ఒకటీ మూడు రూపాయల ముప్పై పైసలు చొప్పున ఆరువందలకూ ఎంతొస్తుందిరా?" అని సుంధరాన్ని అడిగాను. వాడు మాట్లాడలేదు... మళ్ళీ అడిగితే 'నీవద్ద కేలెక్యులేటర్ వుందా? అన్నాడు. 'ఈ మాత్రం లెక్కకి కాలెక్యులేటర్ దేనికి – నీకు తలకాయలేదా?' అన్నాను. అంతే అంతవరకూ సరదాగా వున్న సుందరం ఆ క్షణం నుంచీ బిగుసుకు పోయాడు. మీ అమ్మ బతిమాలితే అన్నం తిన్నాననిపించాడు. ఆ వెంటనే ప్రయాణమై పోయాడు. ఇక్కడ జరిగినదింతే! నోటిలెక్కకు కూడా కాలెక్యులేటర్ కావాల్సివచ్చిందంటే వీడు మెదడు లేని వాడుగా తయారయ్యాడని నాకనిపిస్తోంది. ఓ మెదడున్నవాడు కనిపెట్టిన కాలెక్యులేటర్... మెదడు లేనివాళ్ళను తయారు చెయ్యడానికి కాదని నా అభిప్రాయం.. నువ్వూ ఆలోచించు.. మీ నాన్న"

నాకు తల తిరిగినట్లయ్యింది. ఎదురుగా వున్న మావాణ్ణి చూస్తూ ఆలోచనలో పడ్డాను. ❖

## స్వీకరణలు

**'భావమంజరి'** (కవితా సంపుటి)

| | | |
|---|---|---|
| రచయిత | : | ద్విభాష్యం కామరాజు |
| ప్రతులకు | : | ఆలమూరు, తూ.గోదావరి జిల్లా. పిన్ – 533 233. |
| వెల | : | **రూ. 12/-** |